క్లుప్తంగా

ఉచిత కంటి పరీక్షలు

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వర రావు పరీక్షలు చేసి 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఐదుగురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కవల శ్రీను, ప్రజా ప్రతినిధులు సందర్శించారు.

కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం



వేణుగోపాలస్వామి ఆలయంలో రాట ముహూర్తం పూజలు చేస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలకు బుధవారం రాట ముహూర్తం పూజలు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రామచంద్రరావు, ఈఓ రామలింగం పర్యవేక్షణలో అర్చకుడు సంపర లక్ష్మీనరసింహ భాస్కర శ్రీనివాస్ పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్, బోర్డు సభ్యులు, అంగర పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలను పటిష్టం చేయాలి

కె.గంగవరం: గ్రామ స్థాయి నుంచి బూత్ కమిటీలు ఏర్పాటు చేసి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. బుధవారం సత్యవాడలో మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. గ్రామానికి చెందిన వల్లభరెడ్డి పట్టాభి రామయ్యతో పాటు అనుచరులు బీజేపీలో చేరారు. నాయకులు అర్జున్, శేఖర్, వెంకటకృష్ణ, నున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాయం అందజేత

కపిలేశ్వరపురం: గ్రామానికి చెందిన సబ్బితి ప్రసాద్ (31) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా ఆయన భార్య వీరవేణికి బుధవారం సర్పంచ్ శాకా శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ పీతల శ్రావణ్‌కుమార్, కార్యదర్శి రవితేజ తదితరుల చేతుల మీదుగా మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు.

వీఎస్ఎంలో 'సైన్స్ ఫ్యూజన్'



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వీఎస్ఎం వైస్ ప్రెసిడెంట్ మూర్తి తదితరులు

రామచంద్రపురం: స్థానిక వీఎస్ఎం అటానమస్ కళాశాలలో ఈ నెల 27, 28 తేదీలలో సైన్స్ ఫ్యూజన్ నిర్వహించనున్నట్లు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సైన్స్ ఫ్యూజన్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నంబర్ థియరీ ఇన్ డైలీ లైఫ్‌పై పోస్టర్ ప్రజెంటేషన్, సైన్స్ ప్రాజెక్టులు, పీపీటీ ప్రజెంటేషన్ వంటి విభాగాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కళాశాలల విద్యార్థులు హాజరవుతారన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో వేసవిలో తాగునీరు ఎద్దడి తలెత్తకుండా గ్రామ సచివాలయ కార్యదర్శులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బుధవారం సచివాలయ కార్యదర్శులు, ఇతర అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ అంత్యోదయ అప్‌లోడింగ్, స్వామిత్వ రీసర్వే, పన్నులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు తదితర వాటిపై గ్రామాల వారీగా సమీక్షించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కార్యక్రమాలన్నీ నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు.

ఎరువుల యాజమాన్యం పాటించాలి

కాజులూరు: వరి సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, బంధనపూడి తదితర గ్రామాలలో ఆయన పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పంటలపై అవసరానికి మించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. పంటలకు సోకే తెగుళ్లు, వాటి ఉధృతి, పంట స్థితిగతులకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. రైతులు సాగులో వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మేలైన దిగుబడులు సాధించాలన్నారు.

సుజలం... సుపొలం

- సాగునీటి పొదుపు అవసరం
- దిగుబడులకు అదే కీలకం
- క్లస్టర్ పరిధిలో 1.02 లక్షల ఎకరాల్లో సాగు



వెదురుపాకలో కాలువ ద్వారా పొలాలకు వెళ్తున్న నీరు



రబీ పంట

రాయవరం: వరి సాగులో నీటి యాజమాన్యం ఎంతో కీలకం. ఆరుతడి చాలా ముఖ్యం. ప్రస్తుతం రబీకి నీటి కొరత అంతగా లేకున్నా పొదుపుగా వాడుకోవడం అవశ్యకం. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో రైతులు రబీ వరి సాగు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో మొత్తం 1.02 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ప్రస్తుతం శివారు భూములకు కొంతమేర నీటి ఎద్దడి ఉంది. పూర్తి స్థాయిలో నీటి కొరత లేనప్పటికీ, జలాలను పొదుపుగా వాడుకునే దిశగా రైతులు అడుగులు వేస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకునే విషయమై వ్యవసాయ శాఖ కూడా సూచనలు, సలహాలు అందజేస్తుంది.

ఇలా 'సాగు'దాం..

వరి సాగులో మేలైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చు. జలాల వినియోగంలో భాగంగా కాలువలను శుభ్రం చేసుకోవడం వల్ల నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మొక్కల వేర్లు బాగా అభివృద్ధి చెంది పిలకల సంఖ్య అధికంగా వస్తుంది. ఫలితంగా కంకులు దృఢంగా తోడుకుని దిగుబడి పెరగడానికి ఆస్కారం ఉంటుంది. రబీలో ఒక హెక్టారుకు 1200 మిల్లీమీటర్ల వరకూ నీరు అవసరం అవుతుంది. ఇది ప్రాంతాన్ని బట్టి నేల పరిస్థితులకు అనుగుణంగా మారుతుంది.

అధిక దిగుబడికి ఆస్కారం

సాధారణంగా రైతులు వరి మొక్కను పూర్తిగా నీటిలో ఉంచాలనే భావనతో ఎక్కువ నీటిని పొలంలో నిలబెట్టి ఉంచుతారు. ఇది మంచి విధానం కాదని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మొక్కకు తగినంత మాత్రమే నీటిని అందించి నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి రావడానికి ఆస్కారం ఉంటుంది. వరిలో ఈనిక దశ తేమకు సున్నిత దశ. ఈ దశలో బెట్ట పరిస్థితులు ఏర్పడినట్లైతే దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుంది. అందువల్ల ఈ దశలో తప్పనిసరిగా నీటి ఎద్దడి రాకుండా రైతులు చూసుకోవాలి.

95 శాతం వెదజల్లు విధానం

రబీలో 95 శాతం వరకూ వెదజల్లు విధానంలో వరి సాగు చేస్తున్నారు. సాధారణంగా రైతులు ఐదు సెంటీమీటర్ల వరకూ నీటిని నిల్వ కడతారు. దీనివల్ల కలుపు బెడద ఉండదని నీటిని అధికంగా ఉంచుతారు. కానీ రెండు సెంటీమీటర్ల నీటిని పొలంలో ఉంచినప్పటికీ కలుపు బెడద ఉండదు. మూన తిరిగి దుబ్బు చేసే వరకూ రెండు సెంటీమీటర్ల నీటిని పొలంలో నిలబెట్టుకోవాలి. వరికి చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశ వరకూ మాత్రం పొలంలో ఐదు సెంటీమీటర్ల మేర నీటిని నిల్వ కట్టాలి. ఈ విధంగా చేయడంతో గింజలు దృఢంగా తొడుక్కుని అధిక దిగుబడి రావడానికి అవకాశం ఉంటుంది. కోతకు పది రోజుల ముందు నీటిని పూర్తిగా తగ్గించి ఆరబెట్టాలి.

అపోహ నుంచి బయటకు రావాలి



వ్యవసాయ శాఖ అందించే నీటి యాజమాన్య పద్ధతులు, సూచనలను రైతులు పాటించాలి. నీటిని పొదుపుగా వాడి అధిక దిగుబడులు సాధించాలి. అధికంగా నీటిని వినియోగిస్తే ఎక్కువ దిగుబడులు వస్తాయన్న అపోహ నుంచి బయటకు రావాలి.

–కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

రైతులు సహకరించాలి



రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. అన్ని ప్రాంతాలకు నీటిని సమానంగా అందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రతి ఎకరాకు నీటిని అందించాలన్నది జలవనరుల శాఖ లక్ష్యం. ముఖ్యంగా శివారు భూములకు నీటిని అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. రైతులూ సహకరించాలి.

–జి.నాగరాజు, ఏఈ, జలవనరుల శాఖ, రామచంద్రపురం సెక్షన్

ఉత్సాహంగా కవలల దినోత్సవం



కవల విద్యార్థులకు జ్ఞాపికలు అందించి మాట్లాడుతున్న జీవీ రావు

రామచంద్రపురం: ప్రపంచ కవలల దినోత్సవాన్ని స్థానిక మోడరన్ విద్యా సంస్థలలో బుధవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. విద్యా సంస్థల్లో చదువుతున్న కవలలకు ఆ విద్యా సంస్థల అధినేత జీవీ రావు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ గర్భం నుంచి కలసి పెరిగే అదృష్టం కవలలకు మాత్రమే దక్కుతుందన్నారు. సైన్స్ ప్రకారం కవలలలో వెనుక పుట్టిన శిశువును పెద్దవారిగా పరిగణించాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక తరఫున రాములు ప్రదర్శించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, హెచ్ఎం చిట్టిబాబు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

కాజులూరు: పరిసరాల శుభ్రతపైనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని గొల్లపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావు అన్నారు. బుధవారం ఆ గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. అనంతరం పరిసరాల శుభ్రత, వ్యాధుల నిర్మూలన అనే అంశంపై ప్రజలకు సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పించారు. కార్యదర్శి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు.

సామాజిక న్యాయానికి నిర్వచనం సీఎం జగన్

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: సామాజిక న్యాయానికి నిజమైన నిర్వచనం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కొనియాడారు. 18 ఎమ్మెల్సీలకు 14 స్థానాలను ఎస్సీ, బీసీలకు ఇచ్చారంటే ఇంతకంటే నిదర్శనం ఏమీ ఉండదన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా బడుగు బలహీన వర్గాల వారికి చట్టసభల్లో పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి శెట్టిబలిజ సామాజిక వర్గం అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన కుడుపూడి సూర్యనారాయణను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా ఆ సామాజికవర్గానికి మంచి గుర్తింపు ఇచ్చారన్నారు. మాట ఇచ్చినట్టుగానే ఎన్నడూ లేని విధంగా మాదిగలకు చట్టసభలో సముచిత స్థానం కల్పిస్తూ ఆ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయేల్‌ను ఎంపిక చేశారన్నారు. వ్యక్తులను కాకుండా సీఎం జగన్ ఆయా సామాజికవర్గాలను గుర్తించారన్నారు. గతంలో మాజీ సీఎం చంద్రబాబు కోనసీమ ప్రాంతంలో మాదిగలకు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి మోసగించారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. టీడీపీ హయాంలో సామాజికన్యాయం ఎన్నికల ప్రచారంగానే మిగిలిపోయిందన్నారు. ఎస్సీ, బీసీల పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు రావాలని సవాల్

టిడ్కో ప్లాట్లపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని, అందరికీ అనువుగా ఉండే ఆదివారం ఉదయం టిడ్కో ప్లాట్ల వద్ద చర్చకు రావాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆహ్వానించారు. తాను తోకముడిచి పారిపోయే రకం కాదని, రెండు రోజులు ప్లాట్లలో ఉండేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. టిడ్కో ప్లాట్ల లబ్ధిదారుల ఇబ్బందులు తెలియాలంటే వారితో అక్కడే రెండు రోజులు ఉండాలని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ తోట స్పందించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు వేల మందికి ప్లాట్లు ఇచ్చి నీరు, కరెంట్ ఇవ్వలేదని ఎమ్మెల్యే వేగుళ్ల చెబుతున్నారని, ఆ విషయం ఆదివారం ఉదయం 10 గంటలకు బహిరంగ చర్చకు వస్తే లబ్ధిదారుల ముందే తేలుద్దామని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని అసత్య ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, జంగం కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, పలివెల సుధాకర్, ముక్కా దాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా గరుడ హోమం



అర్తమూరులో గరుడ హోమం నిర్వహిస్తున్న బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: అర్తమూరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం అత్యంత వేడుకగా జరిగింది. శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గరుడ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి, విజయ దంపతులు, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ఉపవాస దీక్షలతో గరుడ హోమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ సంతాన లేమితో బాధపడుతూ ఈ గరుడ ప్రసాదం తీసుకున్న అనేక మంది మహిళలు పండంటి బిడ్డలకు జన్మనిచ్చారన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎదుర్కోలు ఉత్సవం, తిరుమల నుంచి టీటీడీ వారు పంపిన 24 మూరల మేల్‌చాట్ పట్టువస్త్రాన్ని స్వామివారికి అలంకరిస్తారు. రాత్రి 8 గంటలకు అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల చేతుల మీదుగా స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించనున్నట్టు బులిస్వామిరెడ్డి తెలిపారు. కర్రి బాపిరెడ్డి, కోనాల సత్తిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా మహా రుద్రయాగం



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



మహా రుద్రయాగాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

నేటితో ముగియనున్న క్రతువు

రాయవరం: సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 12న ప్రారంభమైన పంచాయతన మహా రుద్రయాగం గురువారంతో ముగియనుంది. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో వింజమూరి శ్రీరామ సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, కందర్ప కామేశ్వరశర్మ, వింజమూరి వీరభద్రం, పెద్దింటి శేషాచార్యుల సమక్షంలో 100 మంది వేద పండితులు నిర్విఘ్నంగా మహా రుద్రయాగాన్ని నిర్వహించారు. రోజూ మహన్యాస పూర్వక రుద్ర జపాభిషేకాలు, సూర్య నమస్కారాలు, సూర్య మంత్రానుష్టానం, చండీ సప్తశతీ పారాయణం, మంత్రానుష్టానం, గణపతి, విష్ణు మంత్రానుష్టానాలు, అర్చనలు, చండీ సప్తశతీ హోమం తదితర పూజాధికాలు నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత నిర్వహించిన రుద్రయాగాన్ని ఇదే నెలలో 12న ప్రారంభించడం విశేషంగా చెప్పవచ్చు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన భక్తులు కమిటీగా ఏర్పడి నిర్వహించిన మహా రుద్రయాగంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సోమేశ్వరం, పరిసర గ్రామాలతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ మూర్తి

కె.గంగవరం: పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కర్నెడి మూర్తి అన్నారు. కూళ్ల గ్రామంలో బుధవారం పామర్రు పశు వైద్యశాల ఆధ్వర్యంలో పశువిజ్ఞాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం 87 పశువులకు పశు వైద్యురాలు మోటుపల్లి బిందు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. రూ.10 వేలు విలువ చేసే మందులతో పాటు నట్టల నివారణ మందులు అందజేశారు. రామచంద్రపురం సహాయ సంచాలకుడు ఓరుగంటి రామకృష్ణ, పశు వైద్యులు భవన, ఎం.కృష్ణార్జున్, పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు అవకాశం

కాజులూరు: ఇంటర్ విద్యాభ్యాసం మధ్యలో మానేసిన విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ఇంటర్ విద్యా మండలి సార్వత్రిక విద్యా విధానం ద్వారా ఇంటర్‌లో చేరేందుకు ప్రత్యేక అవకాశం కల్పించిందని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓపెన్ ఇంటర్‌లో చేరాలనుకునే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, ఒరిజినల్ పదో తరగతి మార్కుల లిస్టు, రిజిస్ట్రేషన్ నిమిత్తం మొబైల్ ఫోన్‌తో ఈ నెల 27వ తేదీ లోగా కళాశాలలో సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. చేరిన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు సొమ్ము డిమాండ్

మండపేట: ఆరోగ్యశ్రీ ద్వారా డెలివరీ చేసేందుకు ఓ ఆస్పత్రిలోని సిబ్బంది డబ్బులు అడుగుతున్నారని పట్టణానికి చెందిన గనిశెట్టి శ్రీకాంత్ ఆరోపించారు. మండపేటలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన భార్యకు మరో పది రోజుల్లో డెలివరీ రానుండటంతో వారం రోజుల కిందట పట్టణంలో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించామన్నారు. ముందుగా అంతా బాగానే ఉందని, డెలివరీ చేస్తామని చెప్పి మందులు రాసిచ్చారన్నారు. తర్వాత మళ్లీ వెళ్లగా రూ.30 వేలు చెల్లించాలని, ఈ విషయం ఎవరికీ చెప్పకూడదని సిబ్బంది అన్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు శ్రీకాంత్ తెలిపారు.

సర్వే రాళ్లు పక్కాగా అమర్చాలి



పడమర ఖండ్రికలో సర్వే రాళ్ల అమరికను పరిశీలిస్తున్న ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం

కపిలేశ్వరపురం: ప్రమాణాల ఆధారంగా క్షేత్ర స్థాయిలోని వ్యవసాయ క్షేత్రాల్లో సర్వే రాళ్లను పక్కాగా అమర్చాలని రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. పడమర ఖండ్రికలో బుధవారం చేపట్టిన సర్వే రాళ్ల అమరిక కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. రికార్డులు, క్షేత్ర స్థాయి భౌగోళిక పరిస్థితులను ఆమె పరిశీలించారు. రీసర్వే తీరుపై సంబంధిత అధికారులతో చర్చించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, రీసర్వే డీటీ శ్రీరామ్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వాకతిప్ప లేఅవుట్ పరిశీలన

వాకతిప్పలోని లేఅవుట్‌ను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు పరిశీలించారు. త్వరితగతిన జగనన్న కాలనీలను అభివృద్ధి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని వారన్నారు. వారి వెంట కార్యదర్శి శివచక్రవర్తి, వీఆర్వో ఉమ తదితరులు ఉన్నారు.

క్లస్టర్ ఇన్‌చార్జులతో సమీక్ష

మండపేట: నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని తన స్వగృహం వద్ద బుధవారం పార్టీ నేతలు, క్లస్టర్ ఇన్‌చార్జులతో సమీక్షించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు. కాలికి గాయంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్లను మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పరామర్శించారు.

కాంతులీనుతూ.. ఆధ్యాత్మికత చాటుతూ



కృష్ణార్జున యుద్ధ ఘట్టం నమూనా



ఆకట్టుకుంటున్న రుద్రుడు

రాయవరం: ఆధ్యాత్మికత చాటుతూ జరుగుతున్న వేడుకలో విద్యుత్తు దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోమేశ్వరంలో నిర్వహిస్తున్న మహా రుద్రయాగంలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల సోయగాలు భక్తులకు నయనానందకరంగా మారాయి. రాత్రి సమయంలో కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా ఏర్పాటు చేసిన లెడ్ లైటింగ్ చూపరులను ఆకట్టుకుంటోంది. శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా విద్యుద్దీపాలతో వివిధ రకాల దేవతామూర్తుల ఆకృతులు, అర్జునుడు, శ్రీకృష్ణుడితో కలసి యుద్ధానికి వెళ్తున్నట్లుగా.. అయోధ్యలో శ్రీరాముడు ఇలా పలు రకాల సెట్టింగులు అలరిస్తున్నాయి.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో వైద్యం చేరువ



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ సత్యం

రామచంద్రపురం రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో పేదల చెంతకే వైద్యం దరిచేరిందని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సత్యం అన్నారు. బుధవారం తాడిపల్లిలో డాక్టర్ వైఎస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రోగుల వివరాలు ఆన్‌లైన్ యాప్‌లో నమోదైందీ లేనిదీ పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. షుగర్, బీపీ అనుమానితులకు పరీక్షలు నిర్వహించి, నిర్ధారించిన విషయాలను యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి మమత ఆధ్వర్యంలో 249 మందికి ల్యాబ్ పరీక్షలు చేశారు. మందులను అందజేశారు. డివిజనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ శివరంజని, సర్పంచ్ పిల్లి అచల రాజశ్రీ, యనమదల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం, డివిజనల్ సూపర్‌వైజర్ కె.గోవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

అంబాజీపేట: ముక్కామల–ఈదరపల్లి ప్రధాన రహదారిలో బుధవారం ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముక్కామల నుంచి అమలాపురం వైపు వెళుతున్న ఐటెన్ కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

సేవలు అభినందనీయం

అనపర్తి: ఐటీసీ సహకారంతో ప్రథమ్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామవరం జెడ్పీ హైస్కూల్‌లో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి డిజిటల్ మేళాను హెచ్ఎం ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు ద్వారా విద్యాభివృద్ధికి ప్రథమ్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. హెచ్ఎం ప్రసాద్, రామవరం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు సత్తిరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ మేళా ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక పెరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులను ప్రజాప్రతినిధులు చూసి అభినందించారు. ఎంపీటీసీ సభ్యులు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, పీఎంసీ చైర్మన్ నల్లమిల్లి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి గుండె శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

రావులపాలెం: మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన గార్లపాటి పృథ్వీరాజ్ స్థానిక ఎస్‌వీజీ కాన్వెంట్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులు గుండె మార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి రూ.30 లక్షల వరకూ ఖర్చు అవుతుందని పృథ్వీరాజ్ తల్లిదండ్రులు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌వీజీ కాన్వెంట్ కరస్పాండెంట్ వి.జగపతిరాజు, క్రాంతి వర్మల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, మేనేజ్‌మెంట్, విద్యార్థులతో సంయుక్తంగా సమకూర్చిన రూ.87,735 నగదును బుధవారం కాన్వెంట్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి తండ్రికి అందజేశారు. దాతలను పలువురు అభినందించారు.